సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ఎప్పుడు కూలిపోతాయో..!



వేర్లు బయటికి వచ్చి పట్టు తప్పిన తాటి చెట్లు



విమాన్‌నగర్ రహదారికి ఆనుకుని ఉన్న తాటి చెట్లు

- ప్రమాదభరితంగా తాటి చెట్లు
- విమాన్‌నగర్ వాసుల ఆందోళన

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో తాటి చెట్ల రూపంలో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమాన్ నగర్ రజకుల కాలనీకి వెళ్లే రహదారిలో సుమారు 10 తాటి చెట్లు ఉన్నాయి. వాటి వేర్లు బయటికి వచ్చి కూలే స్థితికి చేరాయి. మూడు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు ఒక తాటి చెట్టు విద్యుత్ తీగలపై పడిపోయింది. అదృష్టవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడలేదు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విరిగి పడిన తాటి చెట్టును తొలగించారు. దీంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ ప్రాంతంలో మరి కొన్ని తాటి చెట్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. రానున్న వర్షా కాలంలో ఇవి కూలే పరిస్థితి ఉందని నివాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీటి వేర్లు బయటకు వచ్చి ఉండటంతో భూమిలో పట్టు లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదభరితంగా మారిన తాటి చెట్లను తొలగించాలని కోరుతున్నారు. అయితే వాటిపై ఆధార పడి జీవిస్తున్న కల్లుగీత కార్మికులు ఈ తాటి చెట్లను తొలగించి తమకు భృతి లేకుండా చేయవద్దని వేడుకుంటున్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 48వ వార్డులో అర్బన్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి రజని. చిత్రంలో మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున

కంచరపాలెం: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్ ఇందిరానగర్‌లో రూ.1.06 కోట్ల ఎన్‌యూహెచ్‌ఎం నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను శనివారం ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ గంకల కవితలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి కృషి చేస్తున్నారన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందేలా కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 63 రకాల వైద్య పరీక్షలు, 19 మంది వైద్య సిబ్బందితో వార్డు ప్రజలకు చేరువగా అర్బన్ హెల్త్ సెంటర్‌ను తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.రాజేంద్ర, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాసరావు, అర్చన, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, కె.అనిల్‌కుమార్‌రాజు, కంటిపాము కామేశ్వరి, కె.వి.ఎన్.శశికళ, ఆళ్ల లీలావతి, సాడి పద్మారెడ్డి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, సీనియర్ నాయకులు ఎస్.అప్పారావు, పిల్లి సుజాత, భరణికాన రామారావు, పేడాడ రమణికుమారి, కిరణ్‌రాజు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, ఆయా వార్డుల అధ్యక్షులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాక్సింగ్‌లో సత్తా చాటిన ప్రవల్లిక



మెడల్ అందుకుంటున్న ప్రవల్లిక యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధికి చెందిన వాకాడ ప్రవల్లిక యాదవ్ 5వ జూనియర్ ఏపీ స్టేట్ బాయ్స్ అండ్ గర్ల్స్ చాంపియన్ షిప్–2023లో చక్కటి ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించింది. విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల మైదానంలో ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన పోటీలో 60 నుంచి 70 కేజీల మహిళల విభాగంలో పోటీలో ప్రవల్లిక యాదవ్ బంగారు పతకం సాధించి శనివారం మల్కాపురం తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు, పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్లు అభినందించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న అభిమానులు

మల్కాపురం: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా 59వ వార్డు హిమాచలీనగర్‌లోని పెంటమాంబ ఆలయం వద్ద ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి నమ్మి గౌరీశ్వరరావుయాదవ్ ఆధ్వర్యంలో శనివారం వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, టీడీపీ యూత్ నాయకుడు రామ్మోహన్ నాయుడు, సినీ నటుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్టిమూర్తి తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి సుమారు వంద మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు



వృద్ధుడితో బీచ్ గార్డులు

అల్లిపురం: పిల్లలు సరిగా చూడటం లేదని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిని వృద్ధుడిని మహారాణిపేట పోలీసులు రక్షించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిలపాలెంలోని చైతన్యనగర్, కనకమ్మ గుడి దగ్గరలో నివసిస్తున్న శీరపు సూర్యనారాయణరెడ్డి అనే 65 సంవత్సరాల వ్యక్తి శనివారం నోవాటెల్ ఎదురుగా గల బీచ్‌లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతుండగా మహారాణిపేట పోలీసులు, బీచ్ గార్డ్స్ అతనిని రక్షించి పెదవాల్తేరులో గల రెడ్‌క్రాస్ హోంకు తరలించి ఆశ్రయం కల్పించారు.

పరిసరాల పరిశుభ్రతలో నేవీ అధికారులు



త్రినాథపురం రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న నేవీ అధికారులు

సింధియా: స్వచ్ఛమైన పరిసర ప్రాంతాలే లక్ష్యంగా ప్రారంభమైన పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాపురంలోని త్రినాథపురం రోడ్డు నుంచి సమీప ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణి హాస్పిటల్ వరకు స్పెషల్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు, నావికులు మొత్తం 100 మంది పాల్గొని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రమాదకరమైన కాలుష్య కారకాలను, ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేసి సుమారు 430 కేజీల వ్యర్థాలను సేకరించి తరలించారు.

తీరనున్న మంచినీటి సమస్య



సమస్యాత్మక ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా : జీవీఎంసీ 62వ వార్డు పరిధి అల్లూరి సీతారామరాజుకాలనీ ప్రజల మంచినీటి సమస్యలు తీరనున్నాయి. గత కొంత కాలంగా మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీ ప్రజలు సమస్యను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన విషయాన్ని సంబంధిత మంచినీటి విభాగం అధికారులను కలిసి ఏయే ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉందో గుర్తించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన పైప్‌లైన్లకు ఉన్న వ్యక్తిగత మంచినీటి కనెక్షన్లను లూప్‌లైన్లకు మార్చాలని, అదే విధంగా ప్రస్తుతం ఉన్న సరఫరా సమయాన్ని పెంచాలని, మరమ్మతులకు గురైన చేతి బోర్లను వెంటనే రిపేరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ సప్‌లై వర్క్ ఇన్‌స్పెక్టర్ రామరాజు, ఫిట్టర్ గోవింద్, సిబ్బంది రవి, వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు పిలక రఘునాథ్‌రెడ్డి, బాబూరావు, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను కలుషితం చేస్తే కఠిన చర్యలు



ఆటోలో వ్యర్థాలు తీసుకొచ్చిన వ్యక్తికి జరిమానా విధిస్తున్న అధికారి

మల్కాపురం : ఓ ఆటో డ్రైవర్ తన ఆటోలో వ్యర్థాలు తీసుకొచ్చి 61వ వార్డు మరిడిమాంబ ఆలయం వద్ద గల విశాలమైన ప్రదేశంలో డంప్ చేయాలనుకున్నాడు. అది గమనించిన వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తన సిబ్బందితో ఆటో డ్రైవర్‌ని పట్టుకుని ఆ వ్యక్తికి రూ. 2 వేలు జరిమానా విధించారు. శనివారం జరిగిన ఈ ఘటనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది శుభ్రంగా ఉండే పరిసరాలను పాడు చేస్తున్నారని అన్నారు. వ్యర్థాలను ఇక్కడికి తీసుకొచ్చి పడేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న సీతంరాజు సుధాకర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో ఇటీవల హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి మూడు పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధితులను శనివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పరామర్శించారు. ప్రమాద బాధితులు ధనలక్ష్మి, మరియమ్మ, కనక మహాలక్ష్మి కుటుంబాలకు రూ. 5 వేలు చొప్పున అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వపరంగా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకిటి నారాయణరావు, చెన్నా జానకిరామ్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి యాంద్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్, గవర రమణ, వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్లతో ఆందోళన



అధికారులతో కలిసి హైటెన్షన్ వైర్లను పరిశీలిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, జీఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ మీదుగా వెళ్లే హై టెన్షన్ వైర్లతో వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పేర్కొన్నారు. శనివారం ఆమె వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల సెబాస్టియన్ కాలనీలో హైటెన్షన్ వైర్ల వల్ల మూడు పూరిళ్లు దగ్ధమైనట్లు తెలిపారు. హై టెన్షన్ వైర్లుండే స్తంభాలకు పొదలు పాకి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీసీఎల్ అధికారులతో కలిసి ఆమె వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించారు. విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్, వెళంగిణిరావు, శ్యామ్‌సుందర్‌రావు, ఆనంద్, కమల్‌కుమార్, ప్రసాద్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, అమలవతి, బాబ్జీ, రమేష్, తిరుమలరావు, కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడంలో ఆనందం



అన్నదానం చేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: పేదల ఆకలి తీర్చడంలో ఎంతో ఆనందం ఉంటుందని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయం సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన అన్నార్తులకు భోజనం వడ్డించి మాట్లాడారు. సంఘం అనేక సేవా కార్యక్రమాలతోపాటు ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేయడం ఆదర్శనీయమన్నారు. దళితుల అభ్యున్నతితోపాటు తాను కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పట్నాల ఝాన్సీ, పుచ్చా కామేశ్వరరావు, తాటిపూడి సీతారామ్, గొల్లమాల మీనా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకుడు



కలియుగ వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు జరిపారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవా దళ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

కలియుగ వెంకన్న ఆలయంలో..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెంకన్న, పద్మావతి, అలమేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుదాం



హాజరైన ప్రజా సంఘాల ప్రతినిధులు



మాట్లాడుతున్న కమిటీ వైస్ చైర్మన్ గోపీనాథ్

సీతంపేట: దేశాన్ని మతోన్మాదం నుంచి రక్షించి దేశ సంపదను కాపాడటమే భారత్ బచావో కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కార్డియాలజిస్ట్, భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ఎఫ్.గోపీనాథ్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన భారత్ బచావో జిల్లా సదస్సులో ముఖ్య వక్తగా ఆయన ప్రసంగించారు. నేడు హిందూ మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, దానికి కారణం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలే అన్నారు. హిందూయిజం పేరుతో దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి హింసలకు పాల్పడి అల్లకల్లోలం రేపుతారని నాడే పూలే, అంబేద్కర్, స్టాలిన్ వంటి మహనీయులు హెచ్చరించారని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రధాన శత్రువులు ముస్లింలు, క్రైస్తవులు, వామపక్షాలు, దళితులన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ బీజేపీ అధికారంలోకి వచ్చాక 2014 ముందు.. ఆ తర్వాత దేశ పరిస్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రజాస్వామ్య వాదులకు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ తరుణంలో దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మోదీ పాలనలో పేదల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందన్నారు. ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గూడూరు సీతామహాలక్ష్మి, చైర్మన్ సి.భాస్కరరావు, ప్రొఫెసర్ సత్యపాల్, కార్యదర్శులు దుడ్డు ప్రభాకర్, జి.వి.రంగారెడ్డి, పొన్నాడ శ్రీనివాస్, ఆర్.వేమన, పౌర, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు కళ్లద్దాల వితరణ



ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో శనివారం కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు చాలా మంది పేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని గమనించి, వెంటనే ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా ఆయన ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 190 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, 67 మందికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. మరో 52 మంది కంటి సమస్యలు ఉన్న వారిని కళ్లద్దాలు వాడాలని వైద్యులు సూచించగా.. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అనతి కాలంలోనే వార్డులో సొంత నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. పేదలకు పెన్షన్ ఇవ్వడం, ఇళ్లు కట్టించి ఇవ్వడం, వైద్య సహాయం అందించడం, వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

దాబాగార్డెన్స్: న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ కార్యదర్శి కె. సురేష్‌కుమార్ కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ మహాసభలు కేరళలో జరిగాయని, తమ సంఘం 1983లో ఆవిర్భవించిందన్నారు. తమ సంఘం నాయకులు పలు సమస్యలపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎన్నికైనట్టు చెప్పారు. అంతర్జాతీయ సంఘంలో దేశం నుంచి ఐఏఎల్ మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. పలు కేసుల్లో న్యాయవాదులకు బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు బార్ కౌన్సిల్‌కి కార్పస్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఐఎం అహ్మద్ మాట్లాడుతూ జడ్జీలతో పాటు న్యాయం కోసం పని చేస్తున్న న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కొన్ని కేసుల్లో వాదిస్తున్న లాయర్లకు రక్షణ ఉండడం లేదని వాపోయారు. న్యాయవాదుల పరిరక్షణకు చట్టం ఉండాలని కోరారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పేదలకు న్యాయం చేయడానికి లాయర్లు కృషి చేస్తున్నారని, లాయర్లు పలు ప్రజా ప్రయోజన పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎంఎస్ఎన్ భగవతి, రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, ఝాన్సీ, సుబ్బారావు పాల్గొన్నారు.

13న స్మృతి దివస్

'సీ' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సామాజిక కార్యక్రమాల నిర్వహణ

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న స్మృతి దివస్ విజయవంతం చేయాలని సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు కోరారు. ఉక్కు పొట్టి శ్రీరాములు కూడలి వద్ద శనివారం సీ ఆధ్వర్యంలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్–2లో ఉత్పత్తి ప్రారంభించే ప్రక్రియలో జరిగిన ఆక్సిజన్ ప్లాంట్ ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి సంస్మరణార్థం ఏటా స్మృతి దివస్ పేరిట రక్తదాన శిబిరం, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. లయన్స్ క్లబ్, జేసీఐల సహకారంతో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీ భవన్‌లో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు నాలుగు దివ్యాంగ, అనాథాశ్రమాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీ, లయన్స్ క్లబ్, జేసిస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐలో ఉద్యోగాల భర్తీకి 13న ఇంటర్వ్యూలు

గాజువాక : ఐసీఐసీఐలో సీనియర్ ఆఫీసర్, రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్సార్, టీబీకే డిగ్రీ కళాశాలలో ఈనెల 13న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఐఎఫ్‌బీఐ, ఎన్ఐఐటీ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న ఈ ఇంటర్వ్యూలకు 2022లో డిగ్రీ పాసైన అభ్యర్థులు, పీజీ ఫైనలియర్ చదువుతున్నవారు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అన్ని తరగతుల్లోను 50 శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆన్‌లైన్ టెస్ట్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు ఉక్కు నిర్వాసితుల మహా ధర్నా

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ ఈ నెల 11న ఉదయం మహా ధర్నా చేయనున్నామని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా అమిత్ షా ప్రకటన చేయాలని కోరారు. నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి ఆలయంలో అన్నసమారాధన

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. దొడ్డి కిరణ్, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

12న అప్రెంటిస్ మేళా

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీసీఎల్, విసూవియస్ ఇండియా లిమిటెడ్, మైలాన్ లాబొరేటరీస్, సినర్జీస్ అండ్ కాస్టింగ్, కనోరియా కెమికల్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, సృజన ఇంజినీరింగ్, జాన్‌బీర్, డొజ్‌కో, వీల్‌మార్ట్ తదితర కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరు కానున్నారని వివరించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అప్రెంటిస్ రిజిస్టర్ నంబర్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 91773 38977, 83744 30616 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.